క్లుప్తంగా

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా తయారు చేయాలని ఎంఈఓ కె.అన్నమ్మ అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో దెందులూరు మండలంలోని 140 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 ఏవీఎస్వీ ప్రసాద్, కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్ఎన్జీవీ శర్మ, రిసోర్స్ పర్సన్ నేరెళ్ల జైకుమార్ ఉన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



గణపవరంలో బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

గణపవరం: వేసవి శిక్షణ శిబిరాలకు క్రమం తప్పకుండా హాజరై వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పలువురు విద్యార్థులకు సూచించారు. గణపవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల బొమ్మలను ఆకర్షణీయంగా వేసి శభాష్ అనిపించుకున్నారు. గ్రంతపాలకురాలు సుభాషిణి, గుమ్మడి సుబ్బారావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమలతోనే రోగాల వ్యాప్తి



నీటి తొట్టెలలో దోమల లార్వాను చూపుతున్న మలేరియా అధికారి లక్ష్మణరావు

గణపవరం: దోమల ద్వారానే పలురకాల వ్యాధులు వ్యాప్తిచెంది ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని, దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వై.లక్ష్మణరావు సూచించారు. మంగళవారం ఆయన గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామంలో దోమలనిర్మూలన పై అవగాహ కార్యక్రమం నిర్వహించారు. వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి మురుగునీటి నిల్వలు, దోమల వ్యాప్తి, దోమల లార్వా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పలువురు మహిళలకు అంట్లుతోమే ప్రాంతం, నీటితొట్టెలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచిన పాత్రల్లో దోమల గుడ్లు, లార్వాను చూపించారు. ఇవి పెరిగిపెద్దవై ప్రజల ఆరోగ్యానికి చేటు చేస్తాయని వివరించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



నాగన్నగూడెంలో కూలీలతో మాట్లాడుతున్న రవి

పెదవేగి : ఉపాధి హామీ పని ప్రాంతాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. మంగళవారం పెదవేగి మండలం నాగన్నగూడెం గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ చట్టం ప్రమాదంలో పడుతుందని తెలిపారు. ఇప్పటికే ఉపాధి హామీకి కేటాయించాల్సిన నిధులు, పని దినాలు తగ్గించి ఉపాధి కూలీలతో ఆటలాడుతోందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఉపాధి కూలీలకు ప్రతి వారం పే స్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతిగా పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశాలలో కూలీలకు మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్టు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. నిరుద్యోగులకు, కూలీలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరి పైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, మండల నాయకులు వెంకటేశ్వర్లు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని, విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఐక్యమత్యమే అభివృద్ధికి పునాది అనే నీతి కథను వివరించారు. నీతి కథలు, జాతీయ నాయకులు చరిత్రలు, ప్రేరణ కలిగించే వ్యక్తుల చరిత్రలను చదివారు. వాటిపై పుస్తక సమీక్షలు రాసారు. గణితంలో మెలకువలు, జీకే అంశాలను చెప్పారు. ఇంగ్లిషు గ్రామర్‌ను టీవీ ఉమామహేశ్వరరావు వివరించారు. సమయాన్ని ఎంతబాగా సద్వినియోగం చేసుకుంటే అంత గొప్ప వ్యక్తిగా ఎదుగుతావని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ చదివే ఆస్తిని, చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో గుర్తింపు పొందాలని సూచించారు. అనంతరం చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమడోలు : చిన్నారులకు ఇంగ్లిషు గ్రామర్ చెబుతున్న జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు



పెదవేగి : గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న చిన్నారులు



భీమడోలు : చదరంగం పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

ఆటపాటల్లోనూ ప్రావిణ్యం సాధించాలి

పెదవేగి : ఆటపాటలతో కూడిన విద్య విద్యార్థి ఉన్నతికి మరింతగా దోహదపడుతుందని పెదవేగి శాఖాగ్రంథాలయం గ్రంథపాలకుడు తోట అరుణకుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఆటలపాటలతో కూడిన శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వివిధ రకాల ఆటలతో గడిపారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక జ్ఞానంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందుకున్నప్పుడే పరిణితిని సాధిస్తాడన్నారు. ప్రతి విద్యార్థీ విద్యతో పాటు ఆటపాటల్లో ప్రావీణ్యాన్ని పొందాలని ఆయన సూచించారు.

'3.92 లక్షల పనిదినాలు కల్పించాం'



ఏపీఓ దశరద రామ్‌జీ

దెందులూరు: దెందులూరు మండలంలో 3.92 లక్షల పని దినాలు కల్పించినట్టు జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరద రామ్‌జీ తెలిపారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యాలకు అనుగుణంగా ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, పూర్తి సహాయ సహకారాలతో 3.92 లక్షల పని దినాలు కల్పించామని చెప్పారు. గ్రామ గ్రామాన ఉపాధి హామీపథకం పనులు కొనసాగుతున్నట్టు చెప్పారు.

హైస్కూల్ ఎదురుగా పేరుకుపోయిన చెత్త



ఉన్నత పాఠశాలకు ఎదురుగా పేరుకుపోయిన చెత్త

దెందులూరు: స్థానిక ఉన్నతపాఠశాల గోడ ఎదురుగా చెత్త పేరుకుపోయింది. ఆహార పదార్థాలు, చెత్తా చెదారం, ఫంక్షన్ల అనంతరం వేస్ట్ మెటీరియల్స్‌ను ఇక్కడ పడేయడంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆప్రాంతవాసులు చెబుతున్నారు. మండలాధికారులు జోక్యం చేసుకుని చెత్తను తొలగించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

స్త్రీ, శిశు సంక్షేమమే లక్ష్యం

దెందులూరు: స్త్రీ శిశు సంక్షేమం అమలుతోనే కుటుంబ, సమాజాభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ పెదపాడు సీడీపీఓ కె.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం గోపన్నపాలెంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన మాసిక మహోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించాలని అన్నారు. ఉద్యోగుల ఐసీడీఎస్ ప్రచారం విస్తృతం చేశారని, లబ్ధిదారులు ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు నూతన శోభను సంతరించుకున్నాయని, ప్రభుత్వ లక్ష్యాలు సాధించమే ఏకైక కర్తవ్యంగా అంకితభావంతో ఉద్యోగులు సేవలందించాలని సూచించారు. సమావేశంలో సెక్టార్ పరిధిలో ఉన్న గోపన్నపాలెం, వేగవరం, మసీదుపాడు, సోమవరప్పాడు, కొత్తపల్లి, చల్లపల్లి, ఉప్పుగూడెం, జగనన్న కాలనీలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, కిశోర బాలికలు తదితరులు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి



గుండుగొలనులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి, సిబ్బంది, కిశోర బాలికలు

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలి

భీమడోలు: మహిళలు, యువతులు తన ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ భీమడోలు ప్రాజెక్టు అధికారిణి కేవీ విజయలక్ష్మి సూచించారు. గుండుగొలను గ్రామ పంచాయతీ పరిధిలో మహిళలు, యువతులు, కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై మాసిక మహోత్సవ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రుతుక్రమ సమయంలో కిషోర్ బాలికలు, యువతులు, మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సుకు సూపర్‌వైజర్ ఎం కవిత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీఓ కేవీ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. రుతుక్రమం తరుణంలో నిషేధిత ఉత్పత్తులను మహిళలు వినియోగించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నట్టు చెప్పారు. ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. రుతుక్రమంలో 11 నుంచి 18 ఏళ్లలోపు కిషోర్‌బాలికలు, 45 ఏళ్ల దాటిన మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత కమిటీలపై ఉందని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు, తల్లులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాజమణి, ఎం విజయలక్ష్మి, జె.పద్మకుమారి, సుందరి, సత్యవేణి, ఈశ్వరమ్మ, అన్నమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ విద్యాకానుక చేరాలి

భీమడోలు: పాఠశాలలు తెరిచే నాటికి ప్రతి విద్యార్థికీ విద్యాకానుక కిట్లను అందించాలని విద్యాశాఖ కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి అన్నారు. భీమడోలులోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఆమె మంగళవారం సాయంత్రం సందర్శించారు. స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలు వివరాలను ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్ కుమార్ నుంచి అడిగి తెలుసుకున్నారు. 1, 2, 8, 9, 10 తరగతుల వారీగా చేరిన పుస్తకాలు, రావాల్సిన పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాల ముద్రతను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు రావాల్సిన నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్ వివరాలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న విద్యా కానుక కిట్లను సకాలంలో పాఠశాలలకు చేరాల్సిన బాధ్యత సంబంధిత మండల టీముపై ఉందన్నారు. ఎక్కడా అలసత్వం వహించవద్దని, ప్రతి విద్యార్థికీ చేరేలా తగు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పుస్తకాలను సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు సత్యప్రసాద్, రమణ, సిబ్బంది సుమలత, రామకృష్ణ పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్‌లో పుస్తకాల వివరాలపై ఆరా తీస్తున్న ఆర్‌జేడీ నాగమణి

అంజన్నకు మల్లెపూలతో పూజ



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న వీక్షకులు భక్తులు

పెదపాడు : మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రెండో రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించారు. మల్లెపూలతోను, తమల పాకులతో ప్రత్యేక పూజలు చేశారు. గోత్ర నామాలతో భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి బంగారు పుష్పాలతో అభిషేకం చేశారు. మంగళవారం కావడంతో స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. దాతలు విరాళాలతో భక్తులకు ప్రసాదాలు అందించారు. కైకలూరుకు చెందిన లక్ష్మీ జ్యోతి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

రుతుక్రమ సమయంలో పరిశుభ్రతే ముఖ్యం

గణపవరం: యుక్తవయస్సు వచ్చిన ఆడపిల్లలకు రుతుక్రమం, సమస్యలపై పూర్తి అవగాహన కల్పించి, వారిలో మానసిక ధైర్యం కల్పించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం ప్రపంచ రుతుక్రమ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని 9 గ్రామాల్లోని వెల్‌నెస్ కేంద్రాల వద్ద యుక్తవయస్సు ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ రుతుక్రమం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత విషయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో యుక్త వయస్సు గల ఆడపిల్లలను కలిసి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. గణపవరం, సరిపల్లె, అర్ధవరం, ముగ్గుళ్ల, కొమ్మర, గోపవరం తదితర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.



ఆడపిల్లలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సంగీత పరికరాలపై శిక్షణ

దెందులూరు: వేసవి కాలంలో చిన్నారుల సమయం వృథా కాకుండా దయామణి మెమోరియల్ బ్లెసింగ్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా నెల రోజులు పాటు వివిధ సంగీత వాయిద్యాలపై 270 మంది చిన్నారులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని స్థానిక మన్నా చర్చి ఫాస్టర్ బెంజిమన్ అన్నారు. నిర్వాహకులను ఆయన అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: కైకరం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వేణు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పెట్రోలు విక్రేతలపై కేసు

భీమడోలు: గుండుగొలను గ్రామంలో రెండు దుకాణాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు విక్రయిస్తున్న యాజమానులు మద్దుల సుదర్శనరావు, బోదా నాగభూషణంలపై మంగళవారం రాత్రి భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేశారు. వారి నుంచి పెట్రోలు స్వాధీనం చేసుకున్నారు. గుండుగొలనులో పోలీసులు కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. రెండు దుకాణాల వద్ద వేర్వేరుగా 8 లీటర్ల పెట్రోలును లూజుగా బ్యాటిళ్లలో నింపి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో అగ్నిప్రమాదాలకు అస్కారం ఉన్న పెట్రోలును విడిగా అమ్మరాదని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ లూజు పెట్రోలు విక్రయాలను నిషేధించిందన్నారు. పెట్రోలు బంకుల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు.




స్వాధీనం చేసుకున్న పెట్రోలు బాటిళ్లు

భీమేశ్వరస్వామి స్థలం లీజు వేలం ఖరారు

పెదపాడు : పెదపాడు మండలం కలపర్రు గ్రామానికి చెందిన భీమేశ్వరస్వామికి చెందిన 46 సెంట్ల భూమిని రెండు భాగాలుగా విభజించి వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఒక భాగాన్ని గోవర్ధన శ్రీరామ్ ఫణికుమార్ రూ.80 వేలకు, రెండో భాగాన్ని ఉడత బాలమురళీ కృష్ణ రూ.1.51 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఒక సంవత్సర కాలానికి ఈ వేలం నిర్వహించినట్టు ఆలయ ఈఓ ప్రకృతాంబ తెలిపారు.

వాతావరణ మార్పులతో ఆక్వాకు ముప్పు



చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు



కౌంట్‌కు రాకుండానే పట్టివేసిన రొయ్యలు

గణపవరం: వాతావరణ మార్పులు ఆక్వా సాగుకు ముప్పుగా పరిణమించాయి. ఒక వైపు ఎండ, మరోవైపు మబ్బులు, ఇంకో వైపు విపరీతమైన ఉక్కబోత, అడపాదడపా వర్షం. ఇలాంటి వాతావరణంలో ఇమడలేక చేపలు, రొయ్యలు కళ్లుతేలేస్తున్నాయి. సరిపడా ఆక్సిజన్ అందక పోవడంతో చెరువుల్లో ఉన్న చేపలు, రొయ్యలు మూతులు పైకెత్తి నీటి ఉపరితలంపై తిరుగాడుతున్నాయి. దీంతో రైతులు అప్రమత్తమై నిరంతరం చెరువుల్లో ఏరియేటర్లను తిప్పుతూ నీటిలో కదలిక తెస్తున్నారు. ఇంజిన్లతో చెరువులోని నీటిని రీసైక్లింగ్ చేస్తూ ఆక్సిజన్ లోటును తీరుస్తున్నారు. నీటిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచే రసాయనాలు కలుపుతూ చెరువులను కంటికి రెప్పలా కాచుకుంటున్నారు. సాధారణంగా వేసవిలో ఆక్వాసాగు సాఫీగా సాగుతుంది. అయితే ఈనెల రెండోవారం నుంచి తుఫాను ప్రభావంతో వర్షాలు కురవడం, వెంటనే ఎండ కాయడం, తరచూ మబ్బులు కమ్ముతూ వాతావరణంలో ఉక్కబోత పెరిగిపోయి చేపలు రొయ్యలకు అవసరమైన ఆక్సిజన్ అందడంలేదు. ఈ పరిస్థితి మరి కొద్దిరోజులు ఇలాగే కొనసాగితే చెరువులు ఖాళీఅవడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆక్సిజన్ లోటుతో చేపలు, రొయ్యలు తేలిపోవడంతో సుమారు రెండు వేల ఎకరాల్లో చేపలు, రొయ్యలు అర్థంతరంగా పట్టివేసి అయినకాడికి అమ్ముకుని నష్టపోయారు. ముఖ్యంగా పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో చేప, రొయ్య పిల్లను వేసిన చెరువుల్లో ఈసమస్య ఎక్కువగా కనిపిస్తోంది. కొన్ని చెరువుల్లో నెంబరింగ్ ఎక్కువగా ఉండటంతో సరుకు ఉక్కిరిబిక్కిరి అవుతుంది. రైతులు ఆఘమేఘాలమీద చెరువుల్లో కొంత సరకుని మధ్యస్తంగా పట్టివేస్తున్నారు. ఒక్కసారిగా చేపలు చనిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు రోజుల క్రితం కొల్లేరు ప్రాంతంలో ఆక్సిజన్ అందక చేపలు తేలిపోవడంతో పలువురు రైతులు తేలిపోయిన చేపలను ఆకివీడు మార్కెట్‌కు తరలించి కిలో రూ.10 నుంచి రూ.20కు అమ్ముకుని కూలి ఖర్చులు దక్కించుకున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం చేప, రొయ్య ధరలు కూడా పతనావస్థలో ఉన్నాయి. వారం వ్యవధిలోనే చేప ధర కిలోకు రూ.10 నుంచి రూ. 20 వరకూ పడిపోయింది. అదే బాటలో రొయ్య ధరకూడా నడుస్తోంది. దీంతో రైతులు టన్నుకు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకూ నష్టపోతున్నారు. అయినా తప్పని పరిస్థితుల్లో పట్టుబడులు చేయక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.